క్లుప్తంగా

హరూన్ బజాజ్ మేళాకు స్పందన



కస్టమర్‌కు తాళం అందజేస్తున్న షోరూం యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్: హరూన్ బజాజ్ విజయదశమి సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన మేళాలో మొదటి రోజు స్పందన లభించింది. జీఎస్‌టి 28% నుండి 18% తగ్గించడం, షోరూం వారు ఇస్తున్న ప్రత్యేక రాయితీలు కింద ప్రతి కస్టమర్‌కు 20వేల రూపాయలకు పైగా ఆదా పొంది సంతోషం వ్యక్తం చేశారు. 2 వీలర్ కొనే అన్ని వర్గాల ప్రజలకు మంచి ఆఫర్ అందిస్తున్నామన్నారు. మొదటి రోజు 120 వాహనాలు అమ్ముడవగా, పండుగ రోజుకు 350 వాహనాలు బుకింగ్ చేసుకున్నారు అని షోరూం యజమాని అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో షోరూం జీఎం పరమేశ్వరరెడ్డి, సేల్స్ మేనేజర్ మూర్తి, అకౌంటెంట్ సుబ్రహ్మణ్యం సిబ్బంది పాల్గొన్నారు.

ఐఆర్‌ను ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు తక్షణమే 35% ఐ ఆర్ ప్రకటించాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కడప జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యదర్శిల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు దాటినప్పటికీ ఇప్పటివరకు ఉద్యోగ ఉపాధ్యాయులకు ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, జిల్లా గౌరవ అధ్యక్షులు కోపూరు నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి శ్రీరాములు పాల్గొన్నారు.

ప్రపంచానికి దీపదారి గురజాడ

కడప సెవెన్‌రోడ్స్ : నేటి ప్రపంచానికి దీపదారి గురజాడ అప్పారావు అని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య పేర్కొన్నారు. గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని సోమవారం కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో వేడుకలు నిర్వహించారు. తెలుగు అధ్యాపకురాలు ఎంవీఎస్ సుధారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకటయ్య ప్రధాన వక్తగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

కడప కోటిరెడ్డి సర్కిల్ : ప్రతి ఒక్కరు పోషకాహారం తీసుకోవడంవల్ల ఆరోగ్యంగా జీవించవచ్చునని అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఉమా మహేశ్వర్ కుమార్ తెలిపారు. సోమవారం కడప నగరంలోని పక్కీర్‌పల్లె అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో రాష్ట్రీయ పోషణ మాసం సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు సమావేశం నిర్వహించారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు.

రణభేరి మహాసభను జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్: సెప్టెంబర్ 25వ తేదీ గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరుగుతున్న రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. సోమవారం కడప యూటీఎఫ్ భవన్‌లో రణభేరి కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సివి రమణ, ఏజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, నాయకులు బత్తుల చంద్రశేఖర్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



కోటిరెడ్డి సర్కిల్ వద్ద ఆందోళన చేస్తున్న వేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయం అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి ప్రకటించాలని ప్రైవేటు డిగ్రీ కళాశాల అసోసియేసన్ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ నాయకులు శ్రీహరి సుబ్బారెడ్డి, ఎస్ వి డి సి శ్రీనివాసులు, సాహిత్య సంజీవరెడ్డి. విద్యార్థి సంఘ నాయకులైన ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్, పిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, ఏ ఐ ఎస్ బి జాతీయ కన్వీనర్ జయవర్ధన్, పిడిఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకన్నలు కడప ఐటీఐ బాలాజీనగర్ నుంచి సంధ్య సర్కిల్ మీదుగా కోటిరెడ్డి సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ. 6400 కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

జగన్మాతా... నమోస్తుతే

- వైభవంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు
- విద్యుద్దీప కాంతులతో వెలుగుతున్న ఆలయాలు

కడప సెవెన్‌రోడ్స్ : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ఎంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. నవరాత్రుల తొలిరోజును పురస్కరించుకుని భక్తులు పలు ఆలయాలను దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పది రోజులపాటు రోజుకో అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్న తరుణంలో ఆలయాలు ఉత్సవ కళను సంతరించుకున్నాయి. భక్తులు నిలువెత్తున బంగారు కాంతులతో ధగధగ లాడుతున్న అమ్మవారిని దర్శించుకుని తన్మయులయ్యారు.

- కడప నగరంలో రాత్రి 7.00 గంటలకు ఆలయాలలో ప్రత్యేక పీఠాలు ఏర్పాటు చేసి అమ్మవారిని కళ్లుచెదిరే అలంకరణలో కొలువుదీర్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళహారతులిచ్చారు. నిర్వాహకులు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.
- దేవుని కడప శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 11.00 గంటలకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. విశేషాభిషేకం నిర్వహించి రాత్రి తిరుచ్చి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ మాడవీదుల్లో ఊరేగించారు.
- శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో తొలిరోజు అమ్మవారు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున పుణ్యనదీ జలాలతో విశేష అభిషేకం నిర్వహించారు. చండీహోమం, శ్రీ చక్రార్చనలు, మహా నివేదన, మంగళ హారతులు వంటి కార్యక్రమాలు జరిగాయి.
- నగర శివార్లలోని శ్రీ లలితా పంచాయతన ఆలయంలో అమ్మవారికి విశేష అభిషేకం, శ్రీ చక్రార్చన, పూజ, కుంకుమార్చన, చండీహోమం లాంటి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు శ్రీ దీక్షాబంధనాలంకారంలో భక్తులను కటాక్షించారు.
- కడప నగరం చిన్నబెస్తవీధిలో వెలిసిన శ్రీ జగన్మాత బాల పోలేరమ్మ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారికి, శివునికి ఏకకాలంలో సామూహిక అభిషేకం, అలంకరణ, అర్చన, తీర్థ ప్రసాద వినియోగాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు శ్రీ దీక్షా బంధనాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.
- హనుమప్పవీధిలోని శ్రీ భద్రావతి సమేత భావనారుషి, శ్రీ సీతారామ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు శ్రీ మహేశ్వరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.
- నాగలకట్ట హనుమప్పవీధిలో వెలిసిన శ్రీ నడివీధి గంగమ్మ తల్లి దేవస్థానంలో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు, మహా మంగళహారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారు తొలిరోజు దీక్షా బంధన అలంకారంలో దర్శనమిచ్చారు.
- శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో దసరా ఉత్సవాలు అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. గంగాయానం, గోపూజ, గణపతి వాచనం, మాతృకాపూజ, పంచగ్రవ్య ప్రాసన, రక్షాబంధనం, ఆచార్యాది రుత్విక్‌వరణం, ప్రధాన దేవతల అభిషేకం, కలశారాధన స్థాపన, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్చన, మంగళ హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారు శ్రీ దీక్షా బంధన దేవి అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.
- గడ్డి బజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో తొలిరోజు స్వామి వారికి తిరుమంజనం, విశేష అలంకరణ నిర్వహించారు. శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి శ్రీ కోదండ రామ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.
- వీటితోపాటు స్థానిక మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో, నబీకోట శ్రీ రామలింగచౌడేశ్వరీదేవి ఆలయం, నాగరాజుపేటలోని రాజరాజేశ్వరీదేవి ఆలయం, ఎర్రముక్కపల్లెలోని శ్రీ చౌడేశ్వరీమాత ఆలయంతోపాటు ఇతర అన్ని ఆలయాలలో ఉత్సవాలను నిర్వహించారు.



భావనారుషి ఆలయంలో శ్రీ మహేశ్వరీదేవిగా అమ్మవారు



మున్సిపల్ మైదానంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో దీక్షా బంధన అలంకారం



దీక్షాబంధన అలంకారంలో దర్శనమిస్తున్న శ్రీ బాలపోలేరమ్మ



దేవునికడపలో తిరుచ్చి ఉత్సవంలో స్వామి, అమ్మవార్లు

ప్రైవేటు టీచర్లకు కూడా సెలవులు ఇవ్వాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 22 నుండి అక్టోబర్ 2 వరకు దసరా సెలవులు ప్రభుత్వ,ప్రైవేటు విద్యా సంస్థలు కు ప్రకటించిందని కానీ జిల్లా లో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ప్రైవేటు పాఠశాలలు యాజమాన్యాలు యథేచ్ఛగా నడుపుతున్నాయని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. సోమవారం నగరంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దసరా సెలవులలో ప్రైవేటు టీచర్లు తప్పకుండా పాఠశాలలకు రావాలని ప్రైవేటు,కార్పొరేట్ పాఠశాలలు యాజమాన్యాలు హుకుం జారీ చేస్తున్నాయని అన్నారు. ఒకవేళ రాకుంటే ఉద్యోగం నుండి తొలగిస్తామని బెదిరిస్తున్నారన్నారు. సెలవులలో వర్క్ షాప్ పేరుతో, స్టడీ పేరుతో, పేపర్ల కరెక్షన్ పేరుతో పాఠశాలలకు రావాలని చెబుతున్నారన్నారు.

దసరా సెలవుల్లో పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు

కడప ఎడ్యుకేషన్: దసరా సెలవుల సందర్భంగా కడప మండలంలో సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం దసరా సెలవులను ఇచ్చిందని కడప మండల విద్యాశాఖ అధికారులు 1, 2లు రఫీక్ అహమద్, ఇర్షాద్ అహ్మద్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఈ సెలవుల్లో ఏ పాఠశాల యాజమాన్యమైనా పాఠశాల నిర్వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ మధుమల్లేశ్వరరెడ్డి

కడప కోటిరెడ్డి సర్కిల్ : నేటి కాలంలో సైబర్ నేరాలు అత్యంత వేగంగా పెరుగుతున్నాయని, వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ మధుమల్లేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం కడప నగరంలోని కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో ఇంగ్లీషు శాఖ ఆధ్వర్యంలో మీట్‌అండ్ గ్రీట్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఫోన్ కాల్స్ నుండి ఇంటర్నెట్ బ్యాంకింగ్ వరకు ప్రతి దశలోనూ ముప్పు ఉందన్నారు. ఒక అనుమానాస్పద లింక్ క్లిక్ చేస్తే తెలియని వ్యక్తితో వ్యక్తిగత సమాచారం పంచుకుంటే జీవితాంతం సమస్యలు తలెత్తవచ్చునన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ సలీం బాష మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీని జ్ఞానార్జనకు మాత్రమే ఉపయోగించాలని, వ్యక్తిగత డేటా, రక్షణ, సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అధ్యాపకులు సుజాత, కె.వి.రమణ, కేశవరెడ్డి, ఆశాలత, అజమ్మతుల్లాలు పాల్గొని ప్రసంగించారు.


చదువుపై దృష్టిసారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జమున

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప రిమ్స్ వైద్య కళాశాలలో సోమవారం తొలి సంవత్సర ఎంబీబీఎస్ విద్యార్థుల ఓరియెంటేషన్ పోగ్రాం ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రిన్సిపల్ డాక్టర్ జమున విద్యార్థులకు వారి విద్యా ప్రయాణం ఎలా ఉండాలి, చదువుపై దృష్టి ఎలా పెట్టాలి, క్యాంపు వాతావరణం ఎలా ఉంటుంది వంటి విషయాలపై అవగాహన కల్పించారు. జ్యోతి ప్రజల్వన అనంతరం ప్రతి డిపార్ట్‌మెంట్ ఫ్యాకల్టీ సభ్యులు తమ పరిచయాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. వారు తమ సందేశాలలో విద్యార్థులకు విద్య, నైతిక విలువలు, భవిష్యత్‌లో మంచి వైద్యులుగా ఎలా ఎదగాలనే విషయాలపై ప్రేరణాత్మకంగా మాట్లాడారు. విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొని తమ కొత్త ప్రయాణాన్ని ఆరంభించారు. కార్యక్రమంలో రిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మెంటల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్రాములు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పెంచలయ్య, ఇతర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అకౌంట్స్ జాగ్రత్తగా నిర్వహించాలి



అకౌంటెంట్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీ నిత్యానందరాజులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో కేజీబీవీలు, మోడల్ స్కూల్‌లలో పనిచేస్తున్న అకౌంటెంట్లు అకౌంట్స్‌ను పక్కాగా నిర్వహించాలని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ నిత్యానందరాజులు పేర్కొన్నారు. సోమవారం కడపలోని సమగ్ర శిక్ష ఆఫీసులో జిల్లాలో కేజీబీవీలు, మోడల్ స్కూల్‌లలో పనిచేస్తున్న అకౌంటెంట్స్‌తో సమగ్ర శిక్ష ఏపీసీ నిత్యానంద రాజులు, జీసిడిఓ దార్ల రూత్ ఆరోగ్య మేరి సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో అకౌంట్ రిజిస్టర్స్ సక్రమంగా నిర్వహిస్తూ అకౌంట్స్ పారదర్శకంగా నిర్వహించాలని తెలియజేశారు. ఆయా పాఠశాలలలో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారాలను కూడా సూచించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఆఫీసు నుండి అకౌంటెంట్స్ ఆఫీసర్ సలీం, అకౌంటెంట్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు గాలికొదిలేసిన ప్రభుత్వం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను పూర్తిగా గాలికొదిలేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంగా తాము రైతుల సమస్యలు లేవనెత్తుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు సంబంధం లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. యూరియా కొరత వల్ల రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, బస్తా యూరియా కోసం కిలోమీటర్ల కొద్దీ క్యూలైన్లలో నిల్చుంటున్నారన్నారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ యూరియా ఎక్కువ వాడితే కేన్సర్ వస్తుందని చెప్పడం సరికాదన్నారు. ఆర్గానిక్ పంటలవైపు రైతులను ప్రోత్సహించి, వారికి అన్ని విధాలుగా అవగాహన కల్పించి ఈ మాటలు మాట్లాడితే బాగుంటుందన్నారు. ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు యూరియా కొరతను నివారించలేక ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. మార్క్‌ఫెడ్ ద్వారా 50 శాతం, ప్రైవేటు డీలర్ల ద్వారా 50 శాతం యూరియాను విక్రయించాల్సి ఉండగా, కమీషన్లకు కక్కుర్తి పడి 100 శాతం ప్రైవేటుకు అప్పగించడం వల్లే ఈ దుస్థితి తలెత్తిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇంత దిక్కుమాలిన ప్రభుత్వాన్ని చూడలేదన్నారు. చంద్రబాబు ఎప్పుడు సీఎం అయినా ఒకటి కొంటే ఒకటి ఫ్రీ అన్నట్లు కరువు లేదా అతివృష్టి వస్తాయన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.40వేలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.5వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 2వేల జనాభాకు ఒక ఆర్‌బీకే ఏర్పాటు చేసి, భూపరీక్షలు మొదలుకొని రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు వెంటనే ఇచ్చేవారన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోతే మార్కెట్ ఇంటర్వెన్షన్ చేసి ధరల స్థిరీకరణ చేసేవారన్నారు. పంట నష్టం వస్తే ఏ సీజన్‌లో పరిహారాన్ని ఆ సీజన్‌లోనే ఇచ్చారని గుర్తు చేశారు. ఈ క్రాప్ నమోదు చేసిన ప్రతి రైతుకు ఇన్‌స్రూ ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇవేవీ అమలు చేయడం లేదన్నారు. రైతులు పండించిన ఉల్లి, మిర్చి, చీని, మామిడి, టమోటా, పొగాకు, మినుము వంటి ఏ పంటలకు కూడా గిట్టుబాటు ధర లేకుండా పోయిందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన 17 నెలల్లో 300 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులు రోడ్డెక్కి ఉద్యమాలు చేస్తున్నారని, విద్య, వైద్యం పేదలకు దూరం చేయాలనే తలంపుతో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వ్యాపారులకు అమ్మేయాలని చూస్తున్నారన్నారు. త్వరలోనే ప్రజలు ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు కిశోర్ బూసిపాటి, పాకా సురేష్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ ఛైర్మెన్ పులి సునీల్ కుమార్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వర్లు, శ్రీరంజన్‌రెడ్డి, ఫయాజ్ పాల్గొన్నారు.

వీకే హోండాలో దసరా సందడి



షోరూం వద్ద కొనుగోలుదారులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలోని ఐటీఐ సర్కిల్ లోగల వీకే హోండా షోరూంలో దసరా సందడి నెలకొంది. యాజమాన్యం ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. షోరూం ఎండీ శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా ప్రతి టూ వీలర్ వాహన కొనుగోలుపై లక్కీ డిప్ ద్వారా ఐదు విలువైన బహుమతులు ఇస్తున్నామన్నారు. ఎతడీ టీవీ, ఫ్రిడ్జి, వాషింగ్‌మిషన్, మొబైల్, వాటర్ హీటర్ తదితర వస్తు సామాగ్రి లక్కీ డిప్ ద్వారా ఇస్తున్నట్లు తెలిపారు. అతి తక్కువ డౌన్ పేమెంట్ రూ. 4999 నుంచి ప్రారంభించి ఎక్ఛేంజ్ బోనస్ 2 వేల వరకు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి హోండా వాహన కొనుగోలుపై జీఎస్టీ తగ్గింపు వల్ల రూ.7999 నుంచి 14999 వరకు ఆదా అయ్యే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి స్కూటర్ కొనుగోలుపై స్క్రాచ్‌కార్డు ద్వారా కూడా విలువైన బహుమతులు పొందవచ్చన్నారు. జిల్లాలోని కడప, రాజంపేట, రైల్వేకోడూరు, వేంపల్లె, కమలాపురం, చిట్వేలి, ఖాజీపేట, మైదుకూరులలో ఉన్న మా షోరూంలలో కూడా ఈ ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ మనోజ్, సర్వీసు మేనేజర్ రమేష్ శ్రీనివాసులురెడ్డితోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ వినియోగించుకోవాలి



మెటీరియల్ ఆవిష్కరిస్తున్న కడప, అన్నమయ్య జిల్లా డీఈఓలు షేక్ షంషుద్దీన్, సుబ్రమణ్యం

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి విద్యార్థుల కోసం ఏపీ బయోలాజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం (జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు ఉపయోగించుకుని మంచి ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షంషుద్దీన్ తెలిపారు. సోమవారం కడపలోని డీఈఓ కార్యాలయంలో సంబంధిత మెటీరియల్‌ను బయాలాజికల్ సైన్సు టీచర్ ఫోరం ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో డీఈఓ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కడప డీఈఓతోపాటు అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం, బయలాజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు బీపీ విజయప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మోహన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తి ఎంతో పవిత్రమయింది



సమావేశంలో మాట్లాడుతున్న బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కడప ఎడ్యుకేషన్: వృత్తుల్లోకెల్ల వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. సోమవారం కడప రిమ్స్ రోడ్డులోని డాక్టర్ వెంకటసుబ్బయ్య బిపిడి, బీఎస్సీ(ఎంఎల్‌టి) కళాశాలలో జరిగిన స్వాగతోత్సవ సభకు ముఖ్య అతిథులుగా డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ ఎమ్మెల్యే సుధాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని ఈ వృత్తిలో పవిత్రత, కరుణ, నిబద్ధత అత్యంత ముఖ్యమని అన్నారు. వైద్యుడు సమాజానికి ఆదర్శప్రాయుడిగా నిలుస్తాడని, ప్రతి విద్యార్థి భక్తి, శ్రద్ధలతో విద్యను అభ్యసిస్తే తాము ఎదగడమే కాక సమాజం ఎదుగుదలకు తోడ్పడతారని పేర్కొన్నారు. విద్య గుప్తనిధి వంటిదని, దానిని ఎవరు అపహరించలేరని, చదువులో ఏకాగ్రత అవసరం అన్నారు. నూతన విద్యార్థులకు వారు హృదయ పూర్వక స్వాగతం పలికారు. స్పిరిట్ కళాశాల కరస్పాండెంట్ నిర్మల మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విజ్ఞానం, వివేకం, విజ్ఞతతో మెలగాలని, తద్వారా తల్లితండ్రులకు, కళాశాలకు మంచిపేరు తీసుకరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రవీంద్ర, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, కళాశాల కో ఆర్డినేటర్ జ్యోతిలతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎనిమది గంటల పనిని రద్దు చేసి 13 గంటల పనిదినాల చట్టాన్ని తీసుకొస్తోందని, దీనిని వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికులు ప్రాణాలు ఒడ్డి పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినాలు రద్దు చేయడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్ విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కార్మికుల హక్కుల కన్నా యాజమాన్యాల ప్రయోజనాలే ముఖ్యమయ్యాయని విమర్శించారు. కార్మికుల వల్ల అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు వారికి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయన్నారు. ఇదే విధానం కొనసాగితే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఆప్కాస్ రాష్ట్ర కార్యదర్శి వెంకట సుబ్బయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవివరప్రసాద్‌రావు, పవన్, ఉదయ్, సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, సీఐటీయూ నగర అధ్యక్షులు చంద్రారెడ్డి తదితరులుపాల్గొన్నారు.

చెర్లోపల్లె లే అవుట్‌లో వసతులు కల్పించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : సీకే దిన్నె మండలం చెర్లోపల్లె లే అవుట్‌లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం నగర కార్యదర్శి ఆదిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డిలు మాట్లాడుతూ చెర్లోపల్లి లే అవుట్‌లో 2007లో పేదలకు పట్టాలిచ్చారని తెలిపారు. కొంతమంది ఇల్లు నిర్మించుకోగా, మరికొంతమంది పునాదులు వేసుకున్నారని తెలిపారు. అయితే వర్షం వస్తే మోకాలి లోతు నీళ్లు నిలుస్తున్నాయని చెప్పారు. వీధి లైట్లు లేకపోవడంతో దొంగతనాలు ఎక్కువయ్యాయన్నారు. పైపులు మాత్రం ఉన్నా తాగునీటి సరఫరా లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

చెత్త కుప్పలను తొలగించాలి

కడప కార్పొరేషన్: నగరంలోని చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన నార్త్, ఈస్ట్ జోన్లలో పర్యటించారు. కమర్షియల్ షాపు యజమానులు బాధ్యతారహితంగా వ్యవహరించి చెత్త ఎక్కడ పడితే అక్కడ పడేస్తే జరిమానా విధించాలని ఆదేశించారు. 25 వ డివిజన్‌లోని ఆకుల వీధిలో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలన్నారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు.

కుక్కల బెడద నుంచి కాపాడాలి

30వ డివిజన్‌లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వీటి నుంచి ప్రజలను కాపాడాలని స్థానిక కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ కోరారు. సోమవారం కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. తమ డివిజన్‌లో దోమలు ఎక్కువగా ఉన్నాయని, ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయాలన్నారు. అలాగే ఇంటి పన్ను, కొళాయి పన్నులు చెల్లించాలని నోటీసులిస్తూ తగిన సమయం ఇవ్వకుండానే కొళాయి కనెక్షన్లు కట్ చేస్తున్నారని, డబ్బు చెల్లించేందుకు వారికి అవకాశం ఇవ్వాలని కోరారు.

కడపలో విద్యుత్ ఉద్యోగుల ర్యాలీ



ర్యాలీలో నినాదాలు చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

కడప కార్పొరేషన్ : తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు కడపలో భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ భవన్ నుంచి మొదలైన ఈ ర్యాలీ మహావీర్ సర్కిల్, విశ్వేశ్వరయ్య సర్కిల్, మహావీర్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్‌కు చేరింది. అక్కడ జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కు, బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాలు సమర్పించారు. ర్యాలీ సందర్భంగా ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, పెద్ద ఎత్తున నినాదాలతో ప్రభుత్వంపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జేఏసీ వైస్ చైర్మన్ బండి రామలింగారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు సమస్యలు దీర్ఘకాలంగా పరిష్కారం కాలేదని, ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన పనికి, సమాన వేతనం చెల్లించాలన్నారు. 1999 నుంచి 2004 వరకూ ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే ఇవ్వాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరింత ఉద్రితమైన కార్యచరణ తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ చైర్మన్ బర్నబాస్, జిల్లా కన్వీనర్ చలపతి, కో కన్వీనర్ బ్రహ్మానందరెడ్డి, జిల్లా వైస్ చైర్మన్ పురుషోత్తం, నాగిరెడ్డి, మురళి, నాగ శేషారెడ్డి, నాగరాజు, ఫయాజ్ బేగ్, రామక్రిష్ణ, మూర్తి, యాకోబు, డి.దొరబాబు తదితరులు పాల్గొన్నారు.